# చిత్తగించవలెను - 'చీకటి'

– పురాణం సుబ్రహ్మణ్య శర్మ

అల్లం శేషగిరిరావు లాటి కథకుడు పుట్టడం తెలుగుదేశం అదృష్టం అంటాను. నేను. కొంచెం పెద్ద మాటే. రావిశాస్త్రి, చాసో మెచ్చిన రచయిత. తెలుగు కథ కుటుంబ పరిధిలో యిరుక్కుపోయినపుడుదాన్ని కొంచెం బయటికి తెచ్చి గాలి పీల్చుకునేలా చేశాను అని చెప్పుకున్నారు రావిశాస్త్రి. అల్లం శేషగిరిరావు తెలుగు కథను వేట మిషతో అడవుల్ని పట్టించి, యిప్పుడు నోమాడ్స్ అనే దేశదిమ్మరుల జీవితంపై చక్కని 'చీకటి' అనే కథను వ్రాశాడు. శేషగిరిరావుకి కథలు రాయడం నేర్పానని నేను అనను కాని చాలా కాలం క్రితం, మేం యిద్దరం రైల్వే లో పనిచేసేప్పుడు రోజూ S – E Rly డివిజనల్ ఆఫీసు గేటు దిమ్మలమీద కూర్చుని పులి చెరువులో పిట్టలవేట' - 'వరదు' టూపతుకథల గురించి ముచ్చటించుకునేవాళ్లం. కథలు రాయడం గురించి అతనికి వుండే బెరుకుని పోగొట్టి, కొన్ని చిన్న చిన్న చిట్కాలు చెప్పాననుకుంటున్నాను. అతన్ని రావిశాస్త్రికి చాసోకి యింకా విశాఖ రచయితలైన కారాగారికి పరిచయం చేయడంలో ప్రమేయం కూడా వుందనుకుంటాను. అసలు అప్పటికి తెలుగు లో బ్రాహ్మణ కుటుంబాల యితివృత్తాలు గల కథలే వచ్చేవి. మరొక వర్గం నుంచి రచయితలు వచ్చి పుంఖాను పుంఖంగా రాసినపుడే కథానిక పరిధి విస్తృతమవుతుందని అనుకునేవాళ్లం. నేనూ కొకుగారున్నూ చింతా దీక్షితులు గారు ఒకప్పుడు యీ మేరకు రాశారేమోనని అనుకుంటున్నాను. క్షమించాలి, జ్ఞాపకం లేదు. ఈ కథ మా ఆవిడ కూడా చదివింది - ఊరుకోక - ఏమిటండీ యీ బూతులు కథ అసహ్యంగా నని ఆవిడ ముఖం చిట్లించి శేషగిరి రావు యిట్లాటి అమర్యాద కరమైన కథలు రాస్తున్నా డేవిటి ? మీ శిష్యుడు కూడానని విసుక్కుంది. ఆవిడ రియాక్షను సరైనదే. మధ్య తరగతి కుటుంబ స్త్రీల మనస్తత్వానికి దేశ దిమ్మరుల జీవితం గురించి రాయడానికి అది చదివి ఆమోదించ డానికి ఆనందించడానికి తగిన భిన్న సంస్కారం కావాలి. పాముల వాళ్ళ గురించి, దొమ్మరివాళ్ళ గురించి, ముష్టివాళ్ళ గురించి కథలు వచ్చినపుడు మర్యాదస్తులైన పాఠకులు మా ఆవిడ లాగే విసుక్కున్నారు. అది ఒక విధంగా కాంప్లిమెంటు. కథ చదివి ఎవరైనా తిడితే పొగడ్త కన్నా అదే మంచి రియాక్షను. అల్లం శేషగిరిరావు 'చీకటి' కథలో శైలీ చమత్కారాలు గిమ్మిక్కులు ఏమీలేవు. కథ జరిగింది జరిగినట్లు చెప్పడం రిపోర్టింగు మాత్రమే ఉంది. అవసరమైనప్పటికీ కొంచెం ఇంగ్లీషు మాటలు దొర్లుతాయి. పంటికింద నలుసుల్లా. అల్లం శేషగిరి రావుకథలు అని యితనికి కథలను నేనే దగ్గరుండి స్వయంగా నాకు తెలిసిన ప్రెస్సులో వేయించాను. నేను ఆంధ్ర జ్యోతి సచిత్రవారపత్రికకు ఎడిటర్‌గా వున్న రోజులలో శేషగిరిరావు రాసిన చాలా మంచి కథల్ని ప్రచురించి ప్రోత్సహించాను. కొత్త రకం కథలను గుర్తించడానికి ఒక దృష్టి ఓపెన్ మైండు వుండాలి. దాదాహయాత్ అనే కుర్రవాడిని నేను స్మైల్ గుర్తించాము. నామిని సుబ్రహ్మణ్య నాయుడుని నేను స్మైల్ గుర్తించాము. మన మధ్య తరగతి మనస్తత్వానికి అశ్లీలంగా అసభ్యంగా బూతులుగా కనిపించేవి, కళాకారుడి మనస్తత్వంతో జాగ్రత్తగా గమనిస్తే కావు, సాహిత్య పోషణకు అవశ్యం కావలసినవి అనిపిస్తాయి. నామిని కథల్లో అశ్లీలాలున్నాయని రామమోహనరావుగారు విసుక్కునే వారు. మధ్య తరగతి ప్యూరిటానిక్ మనస్తత్వం గల సంపాదకులు నిజమైన సాహిత్యానికి చాలా ద్రోహం చేశారు. సారా కథల రావిశాస్త్రిగారిని ప్యూరిటన్లు బాధించినట్లు చలం గారి కథలన్నీ మర్యాదస్తులు చదవ తగినవి కావు అని బహిష్కరించినట్లు. అయితే పరిణత మనస్కులు చదివి గ్రహించకలిగేవి అపరిణత మనస్కులు, చిన్నవారు గ్రహించలేరు కదా.

ఈ చీకటి కథలోకి వస్తే చీకటంటే ఏవిటి ? చీకటంటే అజ్ఞానం. అజ్ఞానం దేన్ని గురించి ? జీవితం గురించి. మనకు తెలియని సంగతులు రివీలు అయినపుడు అజ్ఞానం పోతుంది. ఒక రిటైరుడు మిలిట్రీ అధికారి, ఒక దేశద్రిమ్మరి, పొట్టకోసం వేటాడే మనిషీ కలుసుకున్నపుడు ఏం. జరిగింది? ఎవరి చీకటి తొలగింది ? ఒకుర్నస్టు హెమింగ్వే లాటి వారు రాయ దగిన కథ. తెలుగు కథని సామాజిక స్పృహగాళ్ళ నుంచి, ప్రేమపేర సాగే సెక్సు గోల నుంచి, పోర్నోగ్రఫీ విజృంభణ నుంచి, కుటుంబ గాథల కన్నీటి వరదల నుంచి రక్షించి పైకి తీసుకెళ్ళి కూర్చోబెట్టిన కథ 'చీకటి'. ముందు యీ కథలోని పద జాలాన్ని పరిశీలిద్దాం. ఈ కథలోని కథ డిచిరి గాడిది. పైపైన మిలట్రీ పెద్దమనిషిది చీకటి. ఇందలి భాషకు స్వరూపంలేదట. కలగాపుల గంట. ఒకడైలక్టుకి యిమడదు దీని యితివృత్తం. అందుకే యీ రచయిత ఇంగ్లీషు పదాల్ని యధేచ్ఛగా వాడాడు. శేషగిరిరావులో లోపల డిచిరిగాడు దాగున్నాడు. పైన మిలట్రీ రిటైరుడు ఆసామీ వున్నాడు. బాతుల కథ ప్రధానాంశం. బ్రిటీషు వారు కొన్ని జాతుల్ని క్రిమినల్ జాతులుగా లిస్టు కట్టి సభ్య సమాజం నుంచి బహిష్కరించారు. సంచార జాతుల శీలంపై విసురు. పోలీసు వ్యవస్థ నగ్న స్వరూపం అసహ్యించుకోదగిన స్థాయిలో వుంది. పోలీసులే హాబిచ్యువల్ క్రిమినల్సు. నేరస్థుల్ని తీర్చిదిద్దే వారిగా కాక నేరస్థుల్ని తయారుచేసే వ్యవస్థగా పోలీసులు దర్శనమిస్తారు. పూల మొక్కలు ఆడతనం కలిగినవట. పెద్దపెద్ద వటవృక్షాలు అవి కాపురమున్న మనుష్యుల్ని చూస్తూ - ఆ ముసలి చెట్లకు ఇన్‌ట్యూసిల్ నాలెడ్జి సహజంగా చూడగానే తెలుసుకోగల గ్రహణశక్తి వున్నదంటాడు కెప్టెన్ వర్మ - భార్యలేనివాడు. వేట వ్యసనం గల వర్మకి విక్టర్‌హ్యూగో అంటే యిష్టంట. గన్ పేరు గ్రినెర్సు. అతను నిజంగా చీకట్లో

బయల్దేరతాడు.హంటింగ్ సూటులో వేటకి. (ఈ కథ చదివే వారు యీ పత్రికలోని యింకే కథా చదవలేరు. రచయితని గుర్తించి గౌర వించుతారు. అంటువంటి డివాస్టేటింగు ఎఫెక్టు వుంది దీనికి) రాబందుని అగ్లీబట్ గ్రేస్‌ఫుల్ బర్డ్ అంటాడు. రాబందుల రెక్కల చప్పుడు అనలే శ్రీశ్రీ. రిట్రీవల్ డాగ్ ఒక తోడు అవసరమైనది, శిక్షణ కలది అదీ ఒక పాత్ర.

హంటింగ్‌డాగ్, దానిపేరు సీజరు. తంపర - బురదగుమ్ములు - క్రాంక్‌క్రాంక్ - నక్కలోడు - నత్తగొట్టు - నక్కలోళ్ళు - నత్తగొట్టోళ్ళు - అరవ - పరదపిట్ట - గాగ గొగలి - నల్లిల - రంకుచుక్క - లస్కరసక్ - తసికరిఝా - తపికరి - లపాకిలపధన్ - ఛడిక్ - పెట్టమందు - ఛపక్ - జంగుపట్టక - కొడంగోళ్ళు - పరద - బర్మార్ - గుర్రం - పసర ఈ పదాల ప్రస్తావన అలా వుంచితే, కథ నడిపిన విధానంలో మన అలంకారికులు సూచించే నవరసాలలో చాలా ముఖ్యమైనవి యిందులో వున్నాయి. ఏకోరసః ఏవకరుణ అన్నారు. కరుణ రసం వుంది నిండుగా, తరువాత శృంగారం వుంది. బీభత్సం వుంది కథా కథనంలో క్రోధం వున్నట్లే. ఆయా రసాలను గుర్తించడం పాఠకులకు వదిలేస్తే, కథ నడిపిన తీరు చాలా బాగుంది. డిచిరిగాడు అనే నక్కలోడు, రిటైర్డ్ మిలట్రీ ఆఫీసరు యిద్దరూ చీకట్లో రాత్రి వేటకు బయలుదేరడంతో కథ ప్రారంభం అవుతుంది. బయట చీకటితో ప్రారంభమయి మనసులో తొలగని చీకటితో కథ అంతమవుతుంది. సంచార జాతుల జీవన శైలి చెప్తారు. ఒక పెంపుడు కొంగ డిచిరి గాడికి వేటలో సహకారి కంపానియన్ మిలట్రీ ఆసామీకి సీజర్‌లాగ. డిచిరిగాడి వర్ణన ప్రబంధాలలో కథా నాయకుని వర్ణనల కేమీ తీసిపోదు. అందులో వాడి గురించి తెలుసుకోదగినవాడి జీవన శైలి ద్యోతక మవుతుంది. శ్మశానం దాటి తంపరవైపు నడుస్తున్నాడు. సారా తాగి వాళ్ళు వేడిక్కించు గుంటాడు. కేప్టెన్ వర్మ కూడా తంపర వద్దకు చేరుకుని వేటకు సెటిలవుతాడు. బాతుల మందరివ్వుమని దిగడం వేట టెక్నిక్‌లో చెప్తాడు రచయిత. తంపరలోని బాతులు సమాధానం చెప్తాయి. తుపాకీ ఎలుస్తాడు సరదాకి వేటకు బయల్దేరిన మిలట్రీ ఆసామీ. సీజరు నీటిలో దిగి పడ్డ బాతుల్ని తెస్తుంది. డిచిరిగాడి చలిమంట వద్దకు మిలట్రీ ఆసామీ చేరతాడు. పొట్టకోసం వేటాడే వ్యక్తి, సరదాకి వేటాడే మనిషీ చలిమంట వద్ద కలుసుకుంటారు. వర్ధించిన విస్తరిలాటి వాళ్ళు, విస్తరే లేని వాళ్ల కలుస్తారిక్కడ. అనాగరికుడు నాగరికుడు కలుస్తారు. ఏక వచన ప్రయోగం మిలట్రీ పెద్ద మనిషిని కాస్త కించ పరిచినా సర్దుకుంటాడు. వర్మ డిచిరిగాడు పరస్పరం పరిచయం కావడం కూడా అనాగరికుడి స్టైల్లో వుంటుంది. లాంతరు నెత్తిన పెట్టుకుని వేటకు దిగడం మిలట్రీ ఆసామీని ఆశ్చర్యపరుస్తుంది. వేట టెక్నిక్స్ లోకి వెళ్తున్నారు. వాడు (దొర) తుపాకీ పేల్చడం వల్ల బాతులు ఎగిరిపోయాయి. మరికదిగవని డిచిరిగాడు చెప్తాడు. సరదాకి వేటకు దిగినవాడికీ ఆకలికి పొట్టపోసుకోడానికి దిగేవారి శైలిలో తేడాలు చకితపరుస్తాయి పఠితను గాఢంగా. డిచిరిగాడు తన సెక్సు అనుభవాన్ని చెప్పిన వైనం పఠితను చకిత పరుస్తుంది. అది చాలక. లస్ట్‌ఫర్‌లైఫ్ అందులో కనుపిస్తుంది. అందులో అపరిచితుడైన వర్మకు చెబుతాడు. ఆడదాని మీద మందు జల్లి వశ పర్చుకోవడం విషయం ఎంత పచ్చిగా వున్నా మంచి రుచిగా వుంది. ఎర్రినక్కకర్చి అవి చచ్చిపోవడం - అది పరమ విషాదంగా వుంటుంది. సుఖం వెంట దుఃఖం రుచి పాఠకుడ్ని కలవర పరుస్తుంది. శ్మశానంలో నక్కలు శవాన్ని పీక్కు తినడానికి ప్రయత్నించడం డిచిరిగాడి కాపలా హృదయ విదారకంగా వుంటుంది. కేప్టెను వర్మకు సైతం కళ్ళు చెమర్చేకథ డిచిరిగాడు వినిపిస్తాడు. నత్తగొట్టుని చూపు లేకుండా చెయ్యడానికి దాని కళ్ళు కుట్టేస్తాడు. డిచిరిగాడు రూత్‌లెస్‌నెస్ మనల్ని చకితపరుస్తుంది. తరువాత కథ 'మర్డరు తుపాకీ' కథ. నత్తగొట్టు అరుపుకి తెల్లారిపోయిందనుకుని పిట్టలన్నీ వచ్చి వలలో పడతాయి. డిచిరిగాడి తండ్రి కథ పోలీసుల అమానుష అన్యాయ ప్రవర్తనలకు ఉదాహరణ. పోలీసుల నేర నిరూపణ విధానంలోని పైశాచిక ప్రవృత్తి యిందులో ప్రకటమవుతుంది. సంచార జాతుల పట్ల పోలీసుల నేర నిరూపణ విధానంలోని పైశాచిక ప్రవృత్తి యిందులో ప్రకటమవుతుంది. సంచార జాతుల పట్ల పోలీసుల వైఖరి ఎంత అమానుషమో మన దేశంలో ప్రజల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. తండ్రిని పాతిపెట్టిన గొయ్యి మీద కొడుకు జొన్న రొట్టెలు తిన్న దృశ్యం కరుణ రసానికి పరాకాష్ఠ. డిచిరిగాడి వాతావరణ పరిజ్ఞానం వర్మను ఆశ్చర్య పరుస్తుంది. అయితే యీ కథ చివరలో ఏది హింస ఏది కాదు అనే విచికిత్సమీద డిచిరిగాడి లాజిక్ వర్మను ఆశ్చర్యపరుస్తుంది. డిచిరిగాడు నత్తగొట్టును నిర్వికారంగా చాకుతో కోసి చంపేస్తాడు. బాతుల్ని తుపాకితో చంపడం హింసయితే యిదీ అంతేనంటాడు. డిచిరిగాడు వర్మను తోటి వేట గాడిగా గుర్తించి ఒక బీడీ నజరానాగా యిచ్చుగుంటాడు. కథ చివరలో. వర్మ బంగళాకు వెళ్తాడు - ఇంకా చీకటి వదల్లేదు.

ఈ కథ గురించి యింతటి వ్యాఖ్యానం వెలిగించడానికి పాఠకులకు తగిన స[illegible] యిచ్చి మెలకువలు గుర్తింపచేయడానికి. ఈ శేషగిరిరావు కథ తెలుగు కథా సాహిత్యాన్ని అంతర్జాతీయ మలుపు తిప్పింది అని నేనను కుంటున్నాను. చిత్తగించవలెను.

★

